734) భుజింగిణి

ప॥ ఇదియే సులభము ఇందరికి । కదియగ వశమా కరుణనె గాక ॥

చ॥ నగధరుండు పన్నగశయనుడు భూ- । గగనాంతరిక్ష గాత్రుండు ।
అగణితుడితని నరసి తెలియగా । తగునా కనెడిది దాస్యమె గాక ॥

చ॥ కమలజ జనకుడు కాముని జనకుడు । కమలాసతిపతి ఘనగుణుడూ ।
విమలుండీ హరి వెదకి కావగను । అమరున శరణాగతి గాక ॥

చ॥ దేవుడు త్రిగుణాతీతుడనంతుడు । కైవల్యమొసగు ఘనుడితడు ।
శ్రీవేంకటపతి జీవాంత రాత్ముడు । భావించ వశమా భక్తినె గాక ॥